## క్లుప్తంగా

### అయోధ్య అంక్షితల పంపిణీ



రేణిగుంట: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని పవిత్ర అక్షింతలను తొట్టంబేడు మండలంలోని చిన్నసింగమాలలో వెలసిన శ్రీవీరభద్రస్వామి ఆలయంలో బుధవారం పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలోని ఆలయంలో భక్తులకు పంపిణీ చేస్తున్నట్లు టీడీడీ ధర్మ ప్రచార మండలి సభ్యుడు రాజకుమార్ తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు పిల్లారి బత్తినయ్య పాల్గొన్నారు.

### భక్తులకు అందుబాటులోకి ఏటీఎం సేవలు



ఏటీఎం సెంటర్‌ను ప్రారంభిస్తున్న దేవస్థానం చైర్మన్ తారక శ్రీనివాసులు, ఈఓ రామారావు

రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తులకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆలయ నాలుగో గేటు ప్రాంగణంలో బుధవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు సౌకర్యంగా ఐవోబీ వారు ఏటీఎం సేవలు ప్రారంభించడం సంతోషకరమన్నారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, జనరల్ మేనేజర్ రితేష్‌కుమార్, శ్రీకాళహస్తి బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం రేపు

రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి పట్టణంలో యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సాహం ఉన్న వారందరూ రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు. పానగల్ రోడ్డులోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో శిబిరం జరుగుతుందని, వివరాలకు 8885395305 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

### బాధితులకు పరిహారం పంపిణీ



బాధితులకు నగదును అందజేస్తున్న మోహన్‌రెడ్డి

ఏర్పేడు: ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపాన్ ప్రభావంతో గోడలు, పూరిళ్లు కూలిపోయి నష్టం వాటిల్లిన బాధితులకు ప్రభుత్వం విడుదల చేసిన పరిహార చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. అంజిమేడు పంచాయతీ పోతుమానిగుంట ఎస్టీ కాలనీలో సర్పంచ్ తాతేకాల్వ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు కన్నలి మోహన్‌రెడ్డి బాధితులకు వీటిని అందజేశారు. వారు మాట్లాడుతూ వర్షానికి పోతుమానిగుంట ఎస్టీ కాలనీలో 18 పూరిళ్లు నేలకొరిగినట్లు వివరించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.4 వేలు వంతున పరిహారం అందజేసినట్లు చెప్పారు.

### చిన్నాపట్టు వద్ద రెండు లారీలు ఢీ



లారీ నుంచి రోడ్డుపై పడిన ఐరన్ మెటీరియల్

నాగలాపురం: మండలంలోని చిన్నాపట్టు వద్ద మలుపులో బుధవారం ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్నాయి. పోలీసుల కథనం మేరకు.. పుత్తూరు నుంచి చెన్నైకి భారీ లోడ్‌తో లారీ వెళుతోంది. ఇదే క్రమంలో చెన్నై నుంచి పుత్తూరు వైపు మరో లారీ వస్తోంది. పుత్తూరు నుంచి వెళుతున్న లారీ లోడ్ నుంచి ఒక ఐరన్ మెటీరియల్ రోడ్డుపై పడింది. ఇదే సమయంలో చెన్నై నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఐరన్ మెటీరియల్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవ్వరికీ ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### బాలుర వసతి గృహం తనిఖీ

సత్యవేడు: మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను శ్రీకాళహస్తి డివిజన్ సాంఘిక సంక్షేమశాఖ అధికారి చంద్రశేఖర్ బుధవారం రాత్రి తనిఖీ చేశారు. భోజనం, మెనూ, దుప్పట్లు పంపిణీ వివరాలపై విద్యార్థులను ఆరా తీశారు. వార్డెన్ ఉదయం, సాయంత్రం హాజరుపై విదార్థులను నుంచి సమాచారం కోరారు. రోజు వార్డెన్ హాజరవుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

# ఉరకలేసిన క్రీడోత్సాహం

- హోరాహోరీగా ఆడుదాం–ఆంధ్రా మండల స్థాయి పోటీలు
- నువ్వా–నేనా అన్నట్లు తలపడిన జట్లు



నాగలాపురం: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

వరదయ్యపాళెం: ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ప్రధాన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలు బుధవారం వరదయ్యపాళెం నియోజకవర్గంలో ఉరకలేసే ఉత్సాహంతో జరిగాయి. బుధవారం వరదయ్యపాళెం పోలీస్ క్వార్టర్స్ క్రీడా మైదానంలో జరిగిన పోటీలను అధికారులు, ప్రజాప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. కబడ్డీలో వరదయ్యపాళెం-2 సచివాలయం జట్టు విన్నర్‌గా నిలిచినట్లు ఆడుదాం–ఆంధ్ర మండల కో–ఆర్డినేటర్ బందిల కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. దేశంలో మునుపెన్నడూ లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారుల కోసం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, వైస్ ఎంపీపీ పద్మావతి, సర్పంచ్ జ్యోతి, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, పంచాయతీ ఈఓ బసిరెడ్డి, పీఈటీలు ముద్దుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పిచ్చాటూరులో..**

పిచ్చాటూరు: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలు బుధవారం స్థానిక బైపాస్ వద్ద మైదానంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. తొలిరోజు జరిగిన మ్యాచ్‌లో పిచ్చాటూరు మహిళలు జట్టు, పురుషులు జట్టు విజయం సాధించినట్లు ఎంఈఓ హేమమాలినీ ప్రకటించారు. సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ–2 యుగంధర్ రాజు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ మురళి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, నాయకుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగలో..**

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం..ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీఓ సాయిలహరి ప్రారంభించి, క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. తొలిరోజు క్రికెట్ పోటీలు జరిగాయి. ఎంపీపీ సుబ్బరత్నమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పాల్గొన్నారు.

**నాగలాపురంలో..**

నాగలాపురం: స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎంపీడీఓ పీఎంకే బాబు ఆధ్వర్యంలో మండల స్థాయి ఆడుదాం–ఆంధ్రలో భాగంగా బుధవారం క్రికెట్, వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ శ్యామ్ పోటీలను ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సుమతి, పీడీ బాబు, నాయకులు ఎస్ఎం సురేష్, దేశప్పన్, మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**క్రికెట్‌లో రాగిగుంట జట్టు విజయం**

కేవీబీపురం: ఆడుదాం ఆంధ్రలో భాగంగా బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలు రసవత్తరంగా జరిగాయి. రాయపేడు వేదికగా క్రికెట్, ఆదర్శపాఠశాల, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల వేదికగా ఖోఖో, వాలీబాల్, షటిల్, కబడ్డీ పోటీలు జరిగాయి. ఎంపీడీఓ రామచంద్ర ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య పోటీలను ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో పవనివారి కండ్రిగ జట్టుపై పెరిందేశం జట్టు విజయం సాధించగా, కోట మంగాపురం జట్టుపై కళత్తూరు జట్టు విజయం సాధించింది. కర్లపూడి, రాగిగుంట జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోటీల్లో, రాగిగుంట సూపర్ ఓవర్లో విజయాన్ని అందుకుంది. కబడ్డీలో కోట మంగాపురం జట్టుపై పెరిందేశం జట్టు గెలుపొందింది. వాలీబాల్‌లో రాయపేడుపై కళత్తూరు జట్టు విజయం సాధించింది. మంచి ఆటతీరును కనబరుస్తున్న క్రీడాకారులకు పూర్తి పోత్సాహాన్ని అందిస్తామని గవర్లకృష్ణయ్య పేర్కొన్నారు. నేతలు నందకుమార్, అయ్యప్ప, డేవిడ్, రమేష్, శాస్త్రిరాజు, మణి, జగదీష్, పీడీలు పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తిలో..**

రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి పట్టణంలోని జెడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలను గ్రామీణ స్థాయి నుంచి ప్రోత్సహించేందుకు ఆడుదాం–ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



శ్రీకాళహస్తి : పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి



వరదయ్యపాళెం : క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



బీఎన్‌కండ్రిగ : క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ



పిచ్చాటూరు: బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు



కేవీబీపురం: రాయపేడులో పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు,నేతలు

## పండుగలు వారసత్వ చిహ్నాలు



గాజులమండ్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

రేణిగుంట: పండుగలు సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వానికి చిహ్నాలని ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాజుల మండ్యం శ్రీసాయి గణేష్ విద్యాసంస్థల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో కలసి భోగి మంట వేశారు. ఆటపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. పండుగ వాతావరణం ఉట్టిపడేలా విద్యార్థులు సంప్రదాయ దుస్తులలో హాజరయ్యారు. ఎంపీటీసీ సభ్యుడు జువ్వల ధనంజయరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జువ్వల దయాకర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, విద్యాసంస్థల డైరెక్టర్లు చెంచురెడ్డి, కుమార్‌రాజు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీతోనే ముస్లింల అభ్యున్నతి



ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డితో ముస్లిం మైనారిటీ నాయకులు

రేణిగుంట: ముస్లిం మైనార్టీల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకే సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు షేక్ షాజహాన్ అన్నారు. బుధవారం మండలంలోని అత్తూరులో ముస్లిం మైనారిటీ నాయకులు ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డితో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముస్లింల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను చేస్తున్నారని, మేనమామ సాంగ్యం పేరుతో పేదింట జరిగే వివాహ వేడుకలను సాయం చేస్తున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలు ఏకమై జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీపీకి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జువ్వల దయాకర్‌రెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ బావాజీ, వలీసాహెబ్, అబ్దుల్ గని, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

### అభినవ అంబేడ్కర్ సీఎం జగన్



సచివాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ

తిరుపతి మంగళం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న అభినవ అంబేడ్కర్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని మంగళం రణధీర్‌పురం పంచాయతీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈనెల 19వ తేదీ విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం రణధీర్‌పురం పంచాయతీలోని సచివాలయాల వద్ద అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి దళితజాతికి అంకితం చేస్తున్న గొప్ప నాయకుడు సీఎం జగనన్న అని కొనియాడారు. అనంతరం బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ చేసిన సేవలను స్మరించుకుంటూ సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, అధ్యక్షుడు రజాక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## తొండమనాడు చెరువులోకి 4.68 లక్షల చేప పిల్లలు




చెరువులోకి చేపపిల్లలు వదులుతున్న మత్స్యశాఖ అధికారులు

తిరుపతి అర్బన్: మత్స్యశాఖ జాలర్ల సమక్షంలో రూ.1.50 కోట్ల చేపపిల్లలను గత రెండు నెలలుగా పెంచుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అన్ని చెరువులకు నీరు చేరుకోవడంతో వాటిలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలు వదిలిపెట్టారు. అందులో భాగంగా బుధవారం శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు చెరువుకు 4.68 లక్షల చేప పిల్లలను వదిలిపెట్టారు. గురువారం రేణిగుంట, ఏర్పేడు, శుక్రవారం చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు తదితర మండలాల్లో చేపపిల్లలు వదిలి పెట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. తొండమనాడు కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు రాజేష్, వెంకటరమణతో పాటు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలో బుధవారం పారిశుద్ధ్యం మెరుగునకు సర్పంచ్ రమణమ్మ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. గ్రామం, దళితవాడల్లోని కాలువల్లోని మురుగును కూలీలతో తొలగింపజేశారు. నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగింపజేసి, బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ట్యాంకు క్లోరినేషన్ చేయించారు. దోమలు వృద్ధికాకుండా మలాథీన్ స్ప్రే చేయించారు.

### కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

నాగలాపురం: మండలంలో సంక్రాంత్రి వేడుకల్లో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట జూదం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఓబయ్య తెలిపారు. నిబంధనలు ఉల్లంగిస్తే ఎంతివారిపైననైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బుధవారం ఆయమ విలేకరులతో మాట్లాడుతూ శాంతియుత వాతావరణానికి పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. అలాగే పండుగ సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. విలువైన వస్తువులు, నగదు, బంగారం ఇళ్లలో ఉంచి తాళాలు వేసి వెళ్లకూడదని సూచించారు.

### కండలేరులో 12.851 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 12.851 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 160 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### 13న సంక్రాంతి కవి సమ్మేళనం

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన సాయంత్రం 4 గంటలకు యూత్‌హాస్టల్లో సంక్రాంతి కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త సాకం నాగరాజు అధ్యక్షతన జరిగే ఈ సభకు ద్రావిడ వర్సిటీ వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు కవితా విశ్లేషకులుగా వ్యవహరిస్తారని చెప్పారు. కవులు, రచయితలు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులంతా పాల్గొని సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## ముక్కంటి సేవలో ప్రముఖులు





ఆలయంలో పొన్నూరు ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి, ఆలయం వద్ద సినీనటుడు సుధీర్‌బాబు

రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. పాణ్యం ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి, పత్తిపాడు ఎమ్మెల్యే పూర్ణచంద్రప్రసాద్, సినీనటుడు సుధీర్‌బాబు దర్శించుకున్న వారిలో ఉన్నారు. అధికారులు స్వాగతం పలికి వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించి స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

## జగనన్నకు చెబుదాంతో తక్షణ పరిష్కారం



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వెంకటశేషయ్య

సత్యవేడు: జగనన్నకు చెబుదా కార్యక్రమం ద్వారా ఫిర్యాదుదారులకు తక్షణ పరిష్కారం లభిస్తుందని డీఎల్‌డీఓ వెంకటశేషయ్య తెలిపారు. బుధవారం సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న చెబుదాం కార్యక్రమాన్ని తహసీల్దార్ జరీనా, ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ సిబ్బంది జాప్యం లేకుండా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తారని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటుకు సత్య వేడు పంచాయతీలో స్థలం కేటాయించాలని బలిజ సేవా సంఘం కమిటీ చైర్మన్ కె.బాలమురళీ కృష్ణ కోరారు. అనంతరం వినతులు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, వైద్యాధికారి గుణశేఖర్, ఏఈ మురళి, ఏపీఎం స్వర్ణలత, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## వంద శాతం పింఛన్ల పంపిణీ



అంజిమేడులో పెన్షన్ అందజేత



బీఎన్‌కండ్రిగ: కొత్త పింఛన్ల పంపిణీ

ఏర్పేడు: మండలంలో బుధవారం నాటికి ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు వంద శాతం పింఛన్లు అందజేసినట్లు ఎంపీడీఓ గిడ్డయ్య తెలిపారు. నూతనంగా పింఛన్ మంజూరైన వారి ఇళ్లకే వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందజేయడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, మంజుల, గంగాధరం, గురవమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా నాయకుడు సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగలో..**

బుచ్చినాయుడుకండ్రిగ: అర్హులందరికీ పింఛన్ల్ మంజూరు అయ్యాయని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ తిరుపతి జిల్లా కార్యదర్శి మునిరాజా తెలిపారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ సచివాలయం వద్ద కొత్తగా మంజూరైన వారికి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ నగదును రూ. 3000కు పెంచి వృద్ధులు, వితంతువులను ఆదుకుంటున్నారని తెలిపారు సర్పంచ్ వెంకటమ్మ, సురుటుపల్లి దేవస్థానం సభ్యుడు అజయ్‌కుమార్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పాల్గొన్నారు.

## ఉపాధి పనులను వేగవంతం చేయండి



కూలీలతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధి హామీ పనులను గ్రామాల్లో వేగవంతం చేయాలని పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని ఆమందూరులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేసి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పనులు తక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. పనుల్లో కూలీల శాతాన్ని పెంచాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే వరవ, పంటకాల్వల పనులను చేపట్టాలని పేర్కొన్నారు. జాబ్ కార్డుదారులకు వంద రోజులు కల్పించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, మునగ, పూల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఏపీఓ దేవరి పాల్గొన్నారు.

## బలిజ భవన నిర్మాణంపై రాజకీయాలు తగవు



సమావేశంలో పాల్గొన్న స్వర్ణమూర్తి, సెన్నీరుకుప్పం శేఖర్, గరికపాటి చంద్రశేఖర్

శ్రీకాళహస్తి: బలిజ భవన నిర్మాణ విషయమై రాజకీయలు తగవని బలిజ సంక్షేమ భవన నిర్మాణ కమిటీ పట్టణ నాయకులు పోలస్వామి స్వర్ణమూర్తి, సెన్నీరుకుప్పం శేఖర్, గరికపాటి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో బలిజ భవన నిర్మాణం కోసం బలిజ కులస్తుల అభ్యర్థన మేరకు స్థలం కేటాయించారన్నారు. పార్టీలకతీతంగా ఓ కమిటీని ఏర్పాటు చేసుకుని పనులు ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇందుకు అంజూరు తారక శ్రీనివాసులు, కోలా ఆనంద్, శెట్టిపల్లి సురేష్, కండ్రిగ ఉమ, కొట్టేసాయి వంటి వివిధ పార్టీలకు చెందిన వారు విచ్చేసి సూచనలు చేశారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత మాత్రం హాజరు కాలేదన్నారు. ఆమె ఈ విషయాలను తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదన్నారు. జనవరిలో భవన నిర్మాణానికి భూమిపూజ చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన వంతు సాయం చేస్తామని చెప్పడం సంతోషకరమని పేర్కొన్నారు. వినుత రాజకీయ కోణంలో మాట్లాడడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. బలిజలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వంగవీటి మోహనరంగ విగ్రహావిష్కరణకు తనకు ఆహ్వానం అందలేదని వినుత చెప్పారన్నారు. తాము అందరికీ సెల్‌ఫోన్ వాట్సప్ ద్వారా పంపామని, దానిని ఆమె చూసుకున్నారని తెలిపారు. అతుత్సాహం ప్రదర్శిస్తే ఆమెకే నష్టమన్నారు. ఆరోపణలు చేసే ముందు ఆలోచించాలని హితవు పలికారు.

## గంగ ఉప కాలువ స్థలం ఆక్రమణ



ఆక్రమణకు గురైన భూమి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట చెరువు నుంచి పలు చెరువులకు నీటిని అందించే తెలుగుగంగ ఉప కాలువ భూమి ఆక్రమణకు గురైంది. ఈ ఉప కాలువ శ్రీకాళహస్తి–తడ రోడ్డుకు సమీపంలో ఉండడం, భూమి విలువ పెరగడంతో ఆక్రమంచి ప్లాట్లు కూడా వేశారు. ఉపకాలువ ఏర్పాటు కోసం ప్రభుత్వం గతంలో భూ యాజమానికి నష్టపరిహారం చెల్లించిందని, ఇప్పుడు భూయాజమాని కాలువకు ఇరువైపుల ఉన్న స్థలాన్ని ఆక్రమించడం దారుణమని రైతులు అంటున్నారు. ఉపకాలువను ఆక్రమణను తెలుగుగంగ అధికారులు అడ్డుకోవాలని లేదంటే ఆందోళన చేయాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

## ఎన్నికల నిర్వహణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి అర్బన్: ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని డీఆర్వో పెంచల కిషోర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీప్యాట్‌లపై పూర్తి స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం వినియోగం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవీఎం, వీవీప్యాట్‌లపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉంటేనే ఎన్నికల నిర్వహణ సజావుగా ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, తదితర మౌలిక ఏర్పాట్లు సరి చూసుకోవాలన్నారు. ఎన్నికలో పాల్గొని సిబ్బంది చేయవలసిన విధులు చర్యలు, ఓటింగ్ యంత్రాల వినియోగంపై ముందస్తు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పోలింగ్ నిర్వహణలో చేపట్టాల్సిన వివిధ ఏర్పాట్లపై ఎన్నికల కమిషన్ సూచించిన నియమావళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, నియోజకవర్గస్థాయి అధికారులు పాల్గొన్నారు.